ఆదర్శ పాఠశాల ప్రవేశపరీక్ష గడువు పొడిగింపు

బొల్లారం, ఫిబ్రవరి 23: ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష గడువును విద్యాశాఖ పొడిగించింది. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శపాఠశాల ప్రవేశ పరీక్ష – 2024 దరఖాస్తుల గడువును మార్చి 2 వరకు పొడిగించారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశపరీక్ష యథావిధిగా ఉంటుందన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

కోహీర్, ఫిబ్రవరి 23: గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి అమృత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోహీర్‌లోని ఎంపీపీ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, హరితహారం మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. విశ్వకర్మ దరఖాస్తులను మీసేవ కేంద్రాల్లో వేలిముద్రల సాయంతో ఆన్‌లైన్ చేయించాలని సూచించారు. జహీరాబాద్ డీఎల్పీవోగా బాధ్యతలు స్వీకరించి కోహీర్‌కు తొలిసారి వచ్చినందుకు అమృతను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో భారతి, డీపీవో రఘు, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి

గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 23: స్వచ్ఛభారత్ పితామహుడు, ప్రజా సంఘాల నాయకుడు, సంఘసంస్కర్త సంత్ గాడ్గే బాబా 140వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని రజక సంఘాల సమితి ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీజీవో సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్‌మహేంద్ర, రజక సంఘాల సమితి అధ్యక్షుడు నామాల నాగేశ్, నాయకులు రాజు, యాదయ్య పాల్గొన్నారు.

రాయికోడ్ ఏడీఏగా సత్యనారాయణ

సత్యనారాయణ

రాయికోడ్, ఫిబ్రవరి 23: రాయికోడ్ వ్యవసాయ శాఖ ఏడీఏగా సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడాదిక్రితం అక్కడ ఏడీఏగా పనిచేసిన హరిత రాష్ట్ర వ్యవసాయ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి మునిపల్లి ఏవో శివ కుమార్ ఇన్‌చార్జి ఏడీఏగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాయికోడ్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో నూతన ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని రైతువేదికల వద్ద సిబ్బంది తప్పకుండా అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఏవో అవినాశ్ వర్మ, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న జడ్పీవైస్‌చైర్మన్ ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డి

జిన్నారం, ఫిబ్రవరి 23 : నల్తూరు గ్రామం లో మల్లికార్జున స్వామి జాతరను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మల్లికార్జున స్వా మి కల్యాణోత్సవం, బోనాలు, అగ్నిగుండాల కార్యక్రమాలు జరిగాయి. గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి మల్లన్నను దర్శించుకున్నారు. జడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మాజీసర్పంచ్ నక్కిర్తీజనార్దన్ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండాలు తొక్కే ఘ ట్టాన్ని వీక్షించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, సత్తయ్యపంతులు, ఊట్ల మాజీసర్పంచ్ ఆం జనేయులు, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, పద్మారావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, బీమ్‌రావు, సురేశ్, వీరేశ్, శ్రీనివాస్, నాగభూషణం, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తాం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ
- బర్దీపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన

బర్దీపూర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఝరాసంగం, ఫిబ్రవరి 23: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. శుక్రవారం మండలంలోని బర్దీపూర్‌లో రూ.2.50 కోట్ల జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి, స్థానిక నాయకులతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణంతో బర్దీపూర్ చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయడంతోపాటు బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రికి ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపూరం శివకుమార్, జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మాజీఎంపీ సురేశ్‌షెట్కార్, ఎంహెచ్‌వో గాయత్రిదేవి, పీహెచ్‌సీ వైద్యులు రమ్య, ఎంపీపీ దేవదాస్, జడ్పీటీసీ వినిలా, ఎంపీటీసీ రాజు, హనుమంతురావు పాటిల్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ఈవీఎంలు భద్రపర్చిన గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

స్ట్రాంగ్ రూంల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

జహీరాబాద్, ఫిబ్రవరి 23: స్ట్రాంగ్ రూంల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం సూచన మేరకు స్ట్రాంగ్ రూంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పీవోలు, ఏపీవోలు ఎన్నికల సిబ్బందిని పంపిణీ కేంద్రం వద్ద సమయానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పంపిణీ, రిసెప్షన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రాజు ఉన్నారు.

జర్నలిస్టుపై దాడి అప్రజాస్వామికం

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జర్నలిస్టు శంకర్‌ను పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్, ఫిబ్రవరి 23: జర్నలిస్ట్ శంకర్‌పై దాడి అప్రజాస్వామికమని, శంకర్‌పై దాడిచేసిన వారిని కఠిన శిక్షించాలని మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తుల దాడితో తీవ్రగాయాలై సోమాజీగూడ యశోదలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ శంకర్‌ను పరామర్శించి, దాడికి గత కారణాలను తెలుసుకున్నారు. నిజాలు నిర్భయంగా రాస్తున్న జర్నలిస్టుపై దాడి చేయడం దారుణమన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

జిన్నారం, ఫిబ్రవరి 23: జిన్నారం ఎంపీపీపై ఈనెల 26న అవిశ్వాసం జరగనుండగా ఎంపీపీ రవీందర్‌గౌడ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈనెల 26న జరగనున్న అవిశ్వాసం పై హైకోర్టు స్టే విధించింది. హైకోర్టు ఇచ్చిన స్టే కాపీని శుక్రవారం ఆర్డీవో రవీందర్‌రెడ్డికి అందజేసినట్లు ఎంపీపీ రవీందర్ గౌడ్ తెలిపారు. ఈనెల 2న జిన్నారం ఎంపీపీపై అవిశ్వాసం కోరుతూ బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు ఐదుగురు ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేయగా ఈనెల 26న అవిశ్వాసం నిర్వహించేందుకు ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు ఇచ్చారు. ఎంపీపీపై మరో మూడురోజుల్లో అవిశ్వాసం జరగనుండగా ఎంపీపీ రవీందర్‌గౌడ్ హైకోర్టును ఆశ్రయించడంతో స్టే విధించింది. బీఆర్‌ఎస్ ఎంపీటీసీల తదుపరి కార్యాచరణ ఏమిటనేది ఆసక్తిగా మారింది.

ఎనిమిది క్రషర్లకు నోటీసులు

జిన్నారం, ఫిబ్రవరి 23 : నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రజల ఆరోగ్యాలను హరిస్తున్న కంకర క్రషర్లపై అధికారులు చర్యలకు దిగారు. పర్యావరణానికి తూట్లు పొడుస్తున్న ఐదు క్వారీల మూసివేతకు ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు, జిన్నారం మండలానికి చెందిన ఎనిమిది కంకర క్వారీలకు నోటీసులు ఇచ్చారు. అధికారుల చర్యతో మిగతా కంకర క్రషర్ల యజమానుల్లో భయం మొదలైంది. జిన్నారం మండలంలో మొత్తం 41 క్వారీలు ఉన్నాయి. ఇటీవల క్వారీల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీలు చేపట్టింది. నిబంధనల ప్రకారం మైనింగ్ నడుస్తున్నాయా లేదా వివరాలు తీసుకొని ఉన్నతాధికారులకు నివేదించింది. టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇచ్చిన నివేదికల ప్రకారం పటాన్‌చెరు, జిన్నారం మండలాల్లో ఉన్న 75 క్వారీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 5 పరిశ్రమలకు అధికారులు మూసివేత ఉత్తర్వులు ఇచ్చారు. ఇచ్చిన స్థలం కంటే ఎక్కువ స్థలాన్ని ఆక్రమించిన జిన్నారం మండలానికి చెందిన 8 క్వారీలకు నోటీసులు ఇచ్చారు.

'సేవ్ మాదారం' పేరుతో ఆందోళన

మాదారంలో ఉన్న కంకర క్వారీల నుంచి రోజూ అవస్థలు పడుతున్నామని గ్రామ యువకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'సేవ్ మాదారం' పేరుతో యువకులు కొన్ని రోజులుగా కంకర క్వారీల వద్ద ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. మైనింగ్, పీసీబీ, జువాలాజీ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేశారు. ఎనిమిదింటికి నోటీసులు మాత్రమే ఇచ్చారని, మూసివేత ఉత్తర్వులు ఇవ్వాలని యువకులు కోరారు. మాదారం గ్రామాన్ని, ప్రజలను కాపాడాలంటే క్వారీలను శాశ్వతంగా మూసివేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏపీజీవీబీ ఉద్యోగుల సమ్మె

రీజనల్ బ్యాంకు కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ ఏపీజీవీబీ ఉద్యోగులు ఒకరోజు సమ్మె నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని ఏపీజీవీబీ రీజనల్ కార్యాలయం ఎదుట ఆలిండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్‌బీఈఏ కేంద్ర కమిటీ సభ్యుడు ప్రకాశం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకుగా ప్రకటించి సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం పెండింగ్‌లో ఉన్న అన్ని అలవెన్సులను ఇవ్వాలని, గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్న డైలీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఏపీజీవీబీ బ్యాంకు ఉద్యోగుల సంఘం కోశాధికారి శామ్యూల్, అసిస్టెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్వన్, రీజనల్ కార్యదర్శి రామకృష్ణ, ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి రవికుమార్, అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి పద్మభూషణ్, విశ్రాంత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

కొండాపూర్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

కొండాపూర్, ఫిబ్రవరి 23: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో జ్యోతి అన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 13వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి మాట్లాడుతూ ఈ పథకంలో ఎవ్వరూ అక్రమాలకు పాల్పడకూడదన్నారు. 10 రోజులపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో 22 మంది సామాజిక తనిఖీ బృందం పర్యటించి ప్రజాదర్బార్ నిర్వహిస్తారన్నారు. కొన్ని గ్రామాల్లో అవకతవకలు జరిగాయని, వాటిని సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, అధికారులు అంజాగౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో వీరప్ప, ఎస్ఆర్పీ రజినీకాంత్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందించాలి

సంగారెడ్డి డివిజన్ విద్యుత్ అధికారులు, సిబ్బందిలో మాట్లాడుతున్న ఎస్ఈ మాధవరెడ్డి

సంగారెడ్డి, ఫిబ్రవరి 23: వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పని చేయాలని విద్యుత్ అధికారులు, సిబ్బందిని ఎస్ఈ మాధవరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో సంగారెడ్డి డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సంగారెడ్డి, సదాశివపేట, ఇస్నాపూర్ సబ్ డివిజన్లకు సంబంధించిన ఏడీఈలు, ఏఈలు, సంగారెడ్డి డివిజన్ ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. సీఎండీ టెలికాన్ఫరెన్సులో వివరించిన అంశాలను అధికారులకు వివరిస్తూ ప్రభుత్వం విద్యుత్ సరఫరా విషయంలో కచ్చితంగా ఉందని, నిర్లక్ష్యం చేయకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని కోరారు. గతేడాది కంటే ఈ ఏడాది విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందనే అంచనాలతో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మెయింటెనెన్స్, ఓవర్‌లోడ్ అంశాలను సమన్వయం చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవిలో కరెంట్ సమస్య రాకుండా చూడాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 23: వేసవిలో కరెంట్ సమస్య రాకుండా విద్యుత్ సరఫరా చేయాలని జహీరాబాద్ డిస్కం డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా అధికారులు సిబ్బంది, నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. కరెంట్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఏడీఈ మధుసూదన్, రజనీకాంత్, ఏఈలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ సమస్యలు రాకుండా చూడాలి

అందోల్, ఫిబ్రవరి 23: వేసవిలో విద్యుత్ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జోగిపేట డివిజన్ విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జోగిపేట డివిజన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని మండలాల అధికారులు, సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించి ఎక్కడైన సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలు, రైతులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తే స్పందించాలని..నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎక్కడైన ఇబ్బందులుంటే డీఈ జోగిపేట 9440814231, ఏడీఈ 9440814223, ఏఈ జోగిపేట/వట్‌పల్లి 9440814236, ఏఈ పుల్కల్ 9440814237, ఏఈ చౌటకూర్ 9440050362, ఏఈ హత్నూర 9440813685 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

జిన్నారం, ఫిబ్రవరి 23: జిన్నారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. జిన్నారం, సోలక్‌పల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు పీఏసీఎస్ సొసైటీ దుకాణాన్ని పరిశీలించారు. ఈ దుకాణాల్లో యూరియా, డీఏపీ మందులను పరిశీలించి, అమ్మకాల వివరాలను అక్కడి నుంచే ఆన్‌లైన్‌లో నమోదు చే శారు. సీజనల్‌గా అవసరమయ్యే మందుల వినియోగం, నిలువపై దుకాణ యజమానులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఎంపీ నిధులతో హైమాస్ట్ లైట్లు

ఝరాసంగం, ఫిబ్రవరి 23: మండలపరిధిలోని గుంతమర్పల్లి గ్రామంలో ఎంపీ బీబీపాటిల్ నిధులతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేతకీ ఆలయ మాజీ చైర్మన్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ ఎంపీని అడిగిన వెంటనే స్పందించి హైమాస్ట్ లైట్లు మంజూరు చేశారన్నారు. ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌లకు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, బంటు నర్సింహులు, సంగమేశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్ను వసూలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో అనిత

హత్నూర, ఫిబ్రవరి 23: గ్రామాల్లో వందశాతం పన్ను వసూలు చేయాలని డీఎల్పీవో అనిత పేర్కొన్నారు. శుక్రవారం హత్నూర రైతువేదికలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, డంప్‌యార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు పారిశుధ్య చర్యలపై అవగాహన కల్పించి గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు వచ్చే పన్నులను వందశాతం వసూలు చేయాలని, విధులపై నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.అనంతరం గుండ్లమాచునూర్‌లోని నర్సరీ, డంప్ యార్డును పరిశీలించారు.

జల్సాలకు అలవాటు పడి కటకటాలపాలు

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్

అందోల్, ఫిబ్రవరి 23: జల్సాలకు అలవాటుపడిన ఆరుగురు యువకులు ట్రాక్టర్లు, ట్రాలీలు చోరీ చేస్తూ కటకటాలపాలయ్యారని సీఐ అనిల్‌కూమార్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పుల్కల్ మండలం శివ్వంపేటకు చెందిన అలకుంట నరేశ్, నత్తి రాజు, ల్యాగల రవికుమార్, వడ్డే శ్రీను, వడ్డే కుమార్, బండారు రవి కూలి పనులు చేస్తూ జల్సాలకు అలవాటుపడి అధిక సంపాదన కోసం ట్రాక్టర్ ఇంజిన్లు, ట్రాలీలు చోరీ చేస్తూ అమ్ముకుంటున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా ముదిమాణిక్యం ఎక్స్‌రోడ్ వద్ద అనుమానంగా తిరుగుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా రెండు ట్రాక్టర్ ఇంజిన్లు, నాలుగు ట్రాలీలు దొంగిలించినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు అరుణ్‌కుమార్ గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి గాయాలు

ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

అందోల్, ఫిబ్రవరి 23: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయని జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఎనగండ్ల గ్రామానికి చెందిన మనికంఠ(30) మరొక వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై జోగిపేటకు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో మనికంఠ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. 108 లో జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లాస్యనందిత మరణం కలిచివేసింది..

భారతీనగర్ కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత(చింకి) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి అన్నారు. లాస్యను మేమంతా చింకి అని పిలుచుకునేవాళ్లమని, రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. మాజీఎమ్మెల్యే సాయన్న మా నాన్నకు చాలా దగ్గరి స్నేహితుడు, వాళ్ల కుటుంబం, మాకుటుంబం ఫ్యామిలి ఫ్రెండ్స్‌లా ఉంటామని, చింకి రెండో అక్క నివేదిత(నిక్కి) నేను బోజిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుకున్నామన్నారు. సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్‌పై లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని తెలియగానే పటాన్‌చెరు దవాఖానకు వెళ్లానని, లాస్య మృతదేహం చూడగానే కన్నీరు ఆగలేదన్నారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు.

వట్‌పల్లి : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే లాస్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వట్‌పల్లి నేతలు

నిప్పంటుకొని మహిళ మృతి

అమీన్‌పూర్, ఫిబ్రవరి 23: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మహిళ మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమణ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా కోటనెమలిపురికి చెందిన శిరీష(20) ప్రసన్నకుమార్‌కు 16 నెలల క్రితం పెండ్లి జరిగింది. వారికి 5 నెలల బాబు ఉన్నాడు. వారు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బంధంకొమ్ముకు 9 నెలల క్రితం వచ్చి ఓ అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా ఉన్నారు. రెండు రోజులు క్రితం బాబుకు స్నానం చేయించడం కోసం కట్టెల పొయ్యిపై నీళ్లు వేడి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు శిరీష నైటీకి మంటలు అంటుకొని ప్రమాదానికి గురైంది. కుటుంబ సభ్యులు పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందింది. దీంతో తల్లి సువార్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మయూరినగర్ సమస్యలు పరిష్కరిస్తాం

మయూరినగర్‌లో కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 23: మయూరినగర్ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. శుక్రవారం మయూరినగర్‌లో బల్దియా అధికారులతో కలిసి ఆమె బస్తీదర్శన్ నిర్వహించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఆమె కాలనీవాసులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం శ్రీసాయినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై కాలనీలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. డీఈ నరేందర్, రాజుగౌడ్, దేవేందర్, విఠల్‌రెడ్డి, వీరిశెట్టి, రమేశ్‌బాబు, భాస్కర్, అంజయ్య, శంకర్‌యాదవ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలలో స్వయంపాలన

మునిపల్లి మండలంలోని బుసారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. ఎంఈవోగా సాయికుమార్, హెచ్‌ఎంగా లో హితస్వతోపాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడు రమణకుమార్ పర్యవేక్షించారు. -మునిపల్లి, ఫిబ్రవరి 23